క్లుప్తంగా

ఎన్‌ఎస్సార్ ట్రస్టు ద్వారా ట్రై సైకిళ్ల వితరణ



కోవూరు : మండల కేంద్రంలోని ఇద్దరు దివ్యాంగులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు బ్యాటరీ ట్రైసైకిళ్లను గురువారం వితరణగా అందజేశారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న సమయంలో కోవూరు 3, 5 సచివాలయాల పరిధిలో ఇద్దరు దివ్యాంగులు ట్రై సైకిళ్లు అందజేయాలని అభ్యర్థించారు. తక్షణమే స్పందించిన ఆయన రోజుల వ్యవధిలో వారికి ట్రై సైకిళ్లు సమకూర్చారు. వీటిని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి చేతుల మీదుగా దివ్యాంగులైన గండవరపు గోపిశంకర్, ఏనాటి సుదర్శన్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, నేతలు వెంకటరమణారెడ్డి, నాగరాజు, శివకుమార్‌రెడ్డి, స్థానిక శివాలయ చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కొలువైన కుంకాళమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి గ్రామస్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. గ్రామోత్సవానికి ఉభయదాతలుగా తూర్పువీధి యూత్ వారు వ్యవహరించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రామాపురంలో ఏకలవ్యుని జయంతి



కొడవలూరు: మండలంలోని రామాపురంలో ఏకలవ్యుని జయంతిని వైహెచ్‌పీఎస్(ఎరుకుల హక్కుల పోరాట సమితి) ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ మాట్లాడుతూ గురువైన ద్రోణాచార్యుని మాటకు విలువనిచ్చి తన బొటని వేలును గురుదక్షణగా ఇచ్చిన ఏకలవ్యుడు ఎంతో గొప్పవాడన్నారు. కార్యక్రమంలో ఆ సమితి జిల్లా చైర్మన్ కట్టా రమణయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసా రాజ్‌కుమార్, కుంభ మణి, సభ్యులు ఎస్.వెంకయ్య, డి.కాటయ్య, బి.నాగరాజు, డి.శ్రీరాములు, డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ప్రయోజనకరం



కొడవలూరు: ప్రజలందరికీ ప్రయోజనకరంగా ఉండేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్లు ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. మండలంలోని రామాపురంలో జగనన్న సురక్షలో భాగంగా ఇంటింటి సర్వేను గురువారం నిర్వహించగా, ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా కొన్ని సాంకేతిక కారణాలతో పథకాలందని అరకొర లబ్ధిదారులకు కూడా మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా వివిధ రకాల సర్టిఫికెట్‌లను ఇంటి వద్దే అందిస్తారని వివరించారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

నెల్లూరు(బృందావనం): తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకొన్నారు. నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించారు.

➡ నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు, పెరియాళ్వార్లకు తిరుమంజనం, శాత్తుమొరైను విశేషంగా నిర్వహించారు. అనంతరం రంగనాథుడికి బంగారు గరుడసేవ, పెరియాళ్వార్లకు గజవాహనసేవను జరిపారు. ఆయా ఉత్సవాలకు ఉభయకర్తలుగా అనుమాలశెట్టి వెంకటేశ్వర్లు కుమారులు, సుధాకర్‌రావు, కరుణ దంపతులు, తదితరులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, మంచికంటి సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు, అర్చనలు, పూజలను విశేషంగా నిర్వహించారు. స్వామివారి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా పల్లంరెడ్డి విజయకుమార్‌రెడ్డి, వసంత దంపతులు వ్యవహరించారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. సుదర్శన నారసింహయాగం, తిరుప్పావై, పూలంగిసేవ, చందనాలంకారం, తదితరాలను జరిపారు.



బంగారు గరుడసేవలో రంగనాథుడు

ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవాన్ని జరిపారు. ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ, తదితరులు పాల్గొన్నారు.



వేదగిరిలో..



పెరియాళ్వార్లకు గజవాహనసేవ



మూలస్థానేశ్వరాలయంలో..



వెంకటేశ్వరపురంలో..

వీఆర్‌ఏల నూతన కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(పొగతోట): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటశివయ్య, భానుచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీఆర్‌ఏల సమావేశానికి ఏపీఆర్‌ఎస్‌ఏ నేత బొబ్బాల మురళి, వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య హాజరయ్యారు. అనంతరం వీఆర్‌ఏల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రాజేష్, కార్యదర్శిగా ప్రేమదాస్, కోశాధికారిగా కేశవరావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రవీంద్ర, అమీర్, అశోక్, చిన్న అంకయ్య ఎన్నికయ్యారు.





భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పర్వదినాన్ని నగరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకొన్నారు. నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నేత్రపర్వంగా మయూర వాహనసేవ

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మేష, మయూర వాహనాలపై గురువారం దర్శనమిచ్చారు. గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా బుర్లా శ్రీనివాసులురెడ్డి, పద్మలత, మెట్టా రాజగోపాల్‌రెడ్డి, స్నిగ్ధ, స్వనిక్‌రెడ్డి, గాదెం సుధాకర్, లక్ష్మీప్రసన్న, అరిగెల శివకుమార్, శివజ్యోతి వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.



అలరించిన పాటలు, నృత్య పోటీలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో అరిగెపూడి విజయకుమార్ సంగీతోత్సవాన్ని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సీనియర్ గాయకులు సుజాత, దుర్గం మధుసూదన్, కరుణకుమార్, కృష్ణయ్య, తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. పాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కాలేషా, రఘురామిరెడ్డి, గోవర్ధన్‌ను సత్కరించారు. వాకాటి విజయకుమార్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, విశపు లలితారామ్, మెట్టు రామచంద్రప్రసాద్, ప్రదీప్, డ్యాన్స్ మాస్టర్ రమణయ్య, విశ్వేశ్వరప్రసాద్, బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

నెల్లూరు(వేదాయపాళెం): ఆటోనగర్‌లోని ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపల్ కామేశ్వరి పేర్కొన్నారు. గురుకుల పాఠశాల ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలను నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామేశ్వరి మాట్లాడారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, తిరుపతి జిల్లాలకు చెందిన మైనార్టీ విద్యార్థులకు అడ్మిషన్లను ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆటోనగర్‌లోని గురుకుల పాఠశాలకు ఈ నెల 30వ తేదీలోపు వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందాలని కోరారు. వివరాలకు 94933 80898 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గంగాభవాని, తదితరులు

నీటి సరఫరాకు అంతరాయం నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం ఏర్పడనుందని కార్పొరేషన్ ఎస్‌ఈ సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం ఆనకట్ట సమీపంలోని ఇన్ టేక్ వాల్ వద్ద పూడికతీత పనులను చేపట్టనున్న కారణంగా అంతరాయం ఏర్పడనుందని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సాయినాథునికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం భజనలు, రాత్రి స్వామికి పల్లకిసేవ గావించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

దుత్తలూరు: మండలంలోని పాపంపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ఉదయగిరి మండలం గండిపాళేనికి చెందిన రామకృష్ణ, శ్రీకాంత్ తమ స్నేహితుడ్ని కలిసేందుకు మోటార్‌సైకిల్‌పై నందిపాడుకు వచ్చారు. స్నేహితుడ్ని కలిసి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో పాపంపల్లి సమీపంలో ఎదురుగా వాహనం రావడంతో రోడ్డు మార్జిన్ దిగారు. తిరిగి రోడ్డు పైకి వచ్చే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అటుగా వస్తున్న వాహనదారులు గమనించి చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వేడుకగా లక్ష తులసీ దళార్చన



నెల్లూరు(బృందావనం): తొలి ఏకాదశిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి ఆలయంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. దత్త పీఠాధీశ్వరుడు గణపతి సచ్చిదానంద స్వామి, దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానందతీర్థ అనుగ్రహంతో పూజలను నిర్వహించామని గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. భగవద్గీత పారాయణం, కృష్ణుడికి మహాహారతులను నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు భక్తులు విశేషంగా హాజరయ్యారు.



మణి సంస్మరణ సభ

నెల్లూరు(వేదాయపాళెం): వ్యక్తి శ్రేయస్సు కన్నా సమాజ శ్రేయస్సుకే మణి బుక్ స్టాల్ వ్యవస్థాపకుడు, ప్రముఖ హేతువాది టీపీ మణి అధిక ప్రాధాన్యమిచ్చారని పలువురు పేర్కొన్నారు. మణి సంస్మరణ సభను నెల్లూరు పట్టణ రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సండే మార్కెట్ గౌరవాధ్యక్షుడు శరవణ్, ప్రముఖ పాత్రికేయుడు ఆలూరు రాఘవశర్మ, చిన్నపిల్లల వైద్యుడు దుర్గేష్, కాళిదాసు పురుషోత్తం, రామచంద్రారెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, మాల్యాద్రి, సునీత, సండే మార్కెట్ కమిటీ నేతలు హఫీజ్, సెంథిల్‌కుమార్, చంద్రన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవశర్మ

చౌకబారు విమర్శలను సహించేదిలేదు

నెల్లూరు (దర్గామిట్ట): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ముంగలపూడి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేసి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ యువజన విభాగం శాయశక్తులా కృషి చేస్తుందని చెప్పారు. గతంతో పోలిస్తే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని, దీన్ని జీర్ణించుకోలేక సోమిరెడ్డి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలకు టికెట్లు ఎక్కడిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో 50 వేల మెజార్టీతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందడం తథ్యమన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఖాజాపీర్ దర్గాలో ప్రత్యేక దువా

నెల్లూరు(బృందావనం): బక్రీద్‌ను పురస్కరించుకొని చిన్నబజార్‌లోని షెహన్‌షా మసీదు ఖాజాపీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలను గురువారం నిర్వహించారు. పీఠాధిపతి బాబాసాహెబ్ బందనవాజ్, ఇమామ్ మౌలానా ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.



జేసీఎస్ ఇన్‌చార్జీల నియామకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జీలుగా నలుగుర్ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. 3, 4, 5, 6, 7, 8, 9వ డివిజన్లకు సాయిప్రసాద్.. 10, 11, 13, 14, 15, 16, 40వ డివిజన్లకు నరేష్‌యాదవ్.. 39, 42, 43, 44, 45, 46, 47వ డివిజన్లకు ఫయాజ్.. 48, 49, 50, 51, 52, 53, 54వ డివిజన్లకు వేమూరి మోషేను నియమించారు.

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని 18 పంచాయతీలు, 26 డివిజన్ల పరిధిలో గల సచివాలయాలకు కన్వీనర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల సచివాలయాల కన్వీనర్‌గా చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. క్లస్టర్ – 1లోని 1, 2, 12, 13, 17, 18, 19వ డివిజన్లకు వంశీకృష్ణ.. క్లస్టర్ – 2లోని 20, 21, 22, 23, 24, 25వ డివిజన్లకు మొయిళ్ల సురేష్‌రెడ్డి.. క్లస్టర్ – 3లోని 26, 27, 28, 29, 30, 31 డివిజన్లకు సాయిరెడ్డి, క్లస్టర్ – 4లోని 32, 33, 34, 35, 36, 37, 38, 41వ డివిజన్లకు పిండి సురేష్‌ను నియమించారు.

బీసీ ఇండస్ట్రియల్ పాలసీ అమలుకు వినతి



నెల్లూరు(వేదాయపాళెం): బీసీ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు గానూ బీసీ ఇండస్ట్రియల్ పాలసీని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ యువజన విభాగ అధ్యక్షుడు లీలాకృష్ణ యాదవ్ కోరారు. అయ్యప్పగుడి సెంటర్‌లోని గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం వెంకటాచలం మండల బీసీ యువత అధ్యక్షుడిగా రూపేష్‌యాదవ్‌ను సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య నియమించారు. జిల్లా ప్రచార కార్యదర్శి అంబటి మురళి, రాంబాబు, కామయ్య, రాజా ఆచారి, విజయకృష్ణ, జయరామరాజు, సునీల్‌కుమార్, దినేష్ యాదవ్, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యర్థులను ఉద్దేశించే అలా అన్నాను'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): టీడీపీలోని తన ప్రత్యర్థులను ఉద్దేశించే దివ్యాంగులు అనే పదాన్ని ఇటీవల ఉపయోగించానని.. ఈ విషయంలో దివ్యాంగులు వేరే ఉద్దేశం తీసుకోవద్దని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యర్థులు చేసిన వ్యాఖ్యలకు మాత్రమే అలా మాట్లాడాల్సి వచ్చిందని, దివ్యాంగులను ఉద్దేశించి కాదని వివరించారు.

గో మాంస తరలింపు అడ్డగింత

నెల్లూరు(మినీబైపాస్): గో మాంసాన్ని తరలిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని బీజేవైఎం జోనల్ ఇన్‌చార్జి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు గో మాంసాన్ని తరలిస్తున్న వాహనాన్ని బోడిగాడితోట వద్ద బీజేవైఎం నేతలు గురువారం అడ్డుకున్నారు. అనంతరం దీనిపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.